క్లుప్తంగా

కేసీఆర్ గొప్ప నాయకుడు

మంచాల: వ్యవసాయానికి 24 గంటలు విద్యుత్ అందించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని ఎంపీపీ నర్మద, మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్య కొనియాడారు. శనివారం మండలంలో సత్తి తండా, లింగంపల్లి గ్రామాల్లో నిర్వహించిన సమావేశాలకు వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా నర్మద, చంద్రయ్య మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం అమలు చేయని సంక్షేమ పథకాలను బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిందన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల ద్వారా ఆడపిల్లల పెళ్లిలకు ఆర్థిక సాయం అందించిన గొప్ప నాయకుడు కేసీఆర్ అంటూ ప్రశంసించారు. తిరిగి బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావాలంటే ఇబ్రహీంపట్నంలో మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఏసీయస్ చైర్మన్ పుల్లారెడ్డి, మండల అధ్యక్షుడు చీరాల రమేశ్, ప్రధాన కార్యదర్శి బహుదూర్, యువజన విభాగం మండల అధ్యక్షుడు బద్రీనాథ్ గుప్తా, నాయకులు రవి, రాంరెడ్డి పాల్గొన్నారు.

మంచిరెడ్డి విజయాన్ని ఎవరూ ఆపలేరు


సమావేశంలో మాట్లాడుతున్న యాదగిరి

ఇబ్రహీంపట్నం: ఎన్ని డ్రామాలాడిన ఇబ్రహీంపట్నం నుంచి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి విజయాన్ని ఎవరూ ఆపలేరని స్థానిక మున్సిపల్ వైస్ చైర్మన్ యాదగిరి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి ధీమావ్యక్తం చేశారు. శనివారం ఇబ్రహీంపట్నంలో మున్సిపాలిటీ బీఆర్ఎస్ బూత్ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపిస్తారని జోస్యం చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధికి కిషన్‌రెడ్డి చేసిన పనులే శ్రీరామరక్షగా నిలుస్తాయన్నారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

జనాభా ప్రాతిపదికన చట్టసభల్లో సీట్లు

టీఎంకేఎంకేఎస్ అధ్యక్షుడు నర్సింహా


జెండాను ఆవిష్కరిస్తున్న నర్సింహా

ఇబ్రహీంపట్నం: జనాభా ప్రాతిపదికన చట్టసభల్లో మత్స్యకారులకు సీట్లు కేటాయించాలని తెలంగాణ మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహ డిమాండ్ చేశారు. టీఎంకేఎంఎస్ 22వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం ఇబ్రహీంపట్నంలో ఆ సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీల మేనిఫెస్టోలో మత్స్యకారుల అంశాలను చేర్చాలన్నారు. చెరువులు, కుంటలు కాలుష్యానికి గురికాకుండా చర్యలు చేపట్టాలని, మత్స్య సంపదకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు శంకర్, మహిళా సొసైటీ అధ్యక్షురాలు మంగమ్మ, మయూరి, నర్సింహ్మ, లక్ష్మి, అవంతి, బాల్‌రాజ్ పాల్గొన్నారు.

అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యం


నియామక పత్రాలు అందజేస్తున్న దశరథ్‌నాయక్, పరమేశ్

కడ్తాల్: అభివృద్ధి, సంక్షేమ పాలన బీఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమని జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, ఆ పార్టీ మండల అధ్యక్షుడు పరమేశ్ అన్నారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో బూత్ కమిటీ కమిటీలను ఎన్నుకున్నారు. కర్కల్‌పహాడ్ గ్రామంలో 165వ బూత్ కమిటీ, గోవిందాయిపల్లి 169, వాస్‌దేవ్‌పూర్ 170, ముద్వీన్ గ్రామంలోని 206, 207, 208 బూత్ కమిటీలను పరమేశ్, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ సమక్షంలో ఎన్నుకున్నారు. అనంతరం బూత్ కమిటీలకు నియామక పత్రాలు అందజేశారు. పార్టీ నాయకులు క్రమశిక్షణతో పనిచేయాలని, వచ్చే ఎన్నికల్లో కల్వకుర్తి నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ విజయానికి పార్టీ శ్రేణులు పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, వైస్ ఎంపీపీ ఆనంద్, ఎంపీటీసీ లచ్చిరామ్‌నాయక్, సర్పంచ్ లక్ష్మీనర్సింహ్మారెడ్డి ఉన్నారు.

కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం

కందుకూరు: మహేశ్వరం నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని పీసీసీ ఎన్నికల ప్రచార కమిటీ సభ్యుడు మల్లేశ్, ప్రతాప్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శనివారం కందుకూరులో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థి విజయానికి అందరూ కలిసికట్టుగా శ్రమించాలని పిలుపునిచ్చారు.

కాంట్రాక్టర్ నిర్లక్ష్యం... ప్రజలకు శాపం

- దుమ్ము లేస్తున్న తుర్కయంజాల్ రోడ్డు
- ముందుకు సాగని మరమ్మతు పనులు
- ఒకడుగు ముందుకు.. నాలుగడులు వెనక్కి
- ఇబ్బంది పడుతున్న ప్రజలు, వాహనదారులు


రెడీమిక్స్ పోసి వదిలేసిన రోడ్డు

తుర్కయంజాల్: ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లన్నీ ధ్వంసమయ్యాయి. వర్షాలతో మొన్నటిదాకా బురదమయంగా ఉన్న రహదారులు వానలు తగ్గాక దుమ్ము రేగుతున్నాయి. దీనికితోడు కాంట్రాక్టర్ నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారింది. సాగర్ రహదారి నుంచి తుర్కయంజాల్ మీదుగా నాదర్‌గుల్ వరకు రూ.16 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన రోడ్డు మరమ్మతులు కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పనులు ముందుకు సాగడం లేదు. నిర్మాణ పనులను మంత్రి హరీశ్‌రావు ప్రారంభించి.. రెండు నెలలు గడుస్తున్నా.. ఇంకా పూర్తి కావడం లేదు. రోడ్డుపై రెడీమిక్స్ పోసి చేతులు దులుపుకున్న కాంట్రాక్టర్ ఇటువైపు కన్నెత్తి చూడడం లేదు. ఫలితంగా రోడ్డుపై ప్రయాణిస్తున్న ప్రజలు, వాహనదారులు దుమ్మురేగిపోతున్నారు.

ముంచెత్తుతున్న దుమ్ము, ధూళి

రోడ్డు పనులు నిలిచిపోవడంతో ప్రయాణికుల ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. వాహనాల రాకపోకలతో దుమ్ము వ్యాపిస్తుండటంతో వాహనచోదకులు అనారోగ్యపాలవుతున్నారు. అలాగే రోడ్డుకు ఇరువైపుల ఉన్న వ్యాపార సముదాయాలు, చిరు వ్యాపారులకు ఇబ్బందులు తప్పడం లేదు. దుమ్ము, ధూళి వలన వ్యాపారాలు సాగడం లేదని వాపోతున్నారు.

కౌన్సిలర్ భర్త అడ్డుచెప్పడంతో..

సాగర్ రహదారి నుంచి తుర్కయంజాల్ గ్రామం మీదుగా నాదర్‌గుల్ నుంచి బార్కస్ వరకు చేపట్టనున్న ఈ రోడ్డు పనులు గతంలో కోర్టు కేసుల కారణంగా కొన్నేళ్లుగా పెండింగ్‌లోనే ఉన్నాయి. దీంతో రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి, కంకర తేలి అధ్వానంగా ఉండేది. ఆలస్యంగానైనా అన్ని అడ్డంకులు తొలిగాయి. కానీ కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పనులు ముందుకు సాగడం లేదు. మొదట్లో ఓ కౌన్సిలర్ భర్త కొన్ని కారణాలను సాకుగా చూపుతూ పనులను అడ్డుకున్నారనే ఆరోపణలున్నాయి. ఆ తర్వాత పనుల్లో పురోగతి కనిపించినా.. ఒక అడుగు ముందుకు.. నాలుగు అడుగులు వెనక్కి అన్న చందంగా కొనసాగుతున్నాయి. ఈ విషయంపై సాక్షి ప్రతినిధి కాంట్రాక్టర్‌ను వివరణ కోరగా వారం రోజుల్లో పనులను చేపడుతానని పేర్కొన్నారు.

105 స్థానాల్లో గెలుస్తాం

- కాంగ్రెస్, బీజేపీ నాయకులను తరిమికొట్టండి
- పాలమూరు-రంగారెడ్డితో సస్యశ్యామలం
- ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్
- ఖానాపూర్‌లో ఎన్నికల ప్రచారం


మాట్లాడుతున్న జైపాల్‌యాదవ్ తదితరులు

తలకొండపల్లి: వచ్చే ఎన్నికల్లో 105 స్థానాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు విజయం సాధించి మూడోసారి సీఎం కేసీఆర్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తారని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ జోస్యం చెప్పారు. రాష్ట్రంలో కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారని గుర్తుచేశారు. శనివారం మండలంలోని ఖానాపూర్‌లో జైపాల్‌యాదవ్, మిషన్ భగీరథ కార్పొరేషన్ రాష్ట్ర వైస్ చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్, ఎంపీపీ నిర్మల, ఎంపీటీసీ సరితతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం సరిత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ సందర్భంగా కారు గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను అభ్యర్థించారు. కేసీఆర్ పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందన్నారు. ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి పేదలకు అండగా నిలిచిందన్నారు. దేశంలోనే తెలంగాణ రోల్ మాడల్‌గా నిలిచిందని కొనియాడారు. రైతుబంధు పథకం ద్వారా రూ.75 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి ప్రభుత్వం ప్రాధాన్యతను ఇస్తోందని తెలిపారు.

ఎమ్మెల్సీపై మండిపడ్డ ఎమ్మెల్యే

ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి స్వార్థంతో పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరారని మండిపడ్డారు. పార్టీ మారిన నాయకులకు ఓటుతో బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు. కల్వకుర్తిలో గులాబీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు అభివృద్ధి నిరోధకులని, ఆ పార్టీల నేతలను తరిమికొట్టాలని జైపాల్‌యాదవ్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాసుయాదవ్, మార్కెట్ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు గోపాల్‌నాయక్, రైతుబంధు మండల కో ఆర్డినేటర్ నర్సింహ, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్‌లు హైమావతి, లక్ష్మణ్, ఈశ్వర్, మోహన్‌రెడ్డి, సింగిల్‌విండో వైస్ చైర్మన్ రవికుమార్, వెంకటయ్య, అశోక్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు కంచుకోట 'మంచాల'


సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

మంచాల: మంచాల మండలం కాంగ్రెస్ పార్టీ కంచుకోట అని ఆ పార్టీ మండల అధ్యక్షుడు రాంరెడ్డి, ఎంపీటీసీ సభ్యుల ఫోరం మండల అధ్యక్షుడు ఎడ్మా నరేందర్ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం మంచాలలో నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో గత రెండు పర్యాయాలు ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాలను కాంగ్రెస్ అభ్యర్థులు కైవసం చేసుకున్నారని తెలిపారు. అంతేకాకుండా స్థానిక సంస్థల ఎన్నికల్లో అధిక స్థానాలను హస్తం పార్టీ దక్కించుకుందని గుర్తుచేశారు. సీఎం కేసీఆర్ హామీలు ఇవ్వడమే తప్ప అమలు చేయడం లేదని మండిపడ్డారు. మిగులు బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రాన్ని నేడు అప్పుల కుప్పగా మార్చారని విమర్శించారు. దళితబంధు, బీసీబంధు వంటి పథకాలను ఊరికి ఒకరికి ఇచ్చి రాష్ట్రమంతటా ఇచ్చామని ఆర్భాటం చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు గ్రామాల్లో అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు, రైతులకు పూర్తి స్థాయిలో రుణమాఫీ, పంట నష్ట పరిహారం ఇచ్చారని గుర్తుచేశారు. ఈ ప్రాంత అభివృద్ధికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే చేసిందేమి లేదని విమర్శించారు. ఇంటింటికి తిరిగి కాంగ్రెస్ పార్టీని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు హన్మంత్‌రెడ్డి, వాజీద్ బాయ్, జైపాల్ రెడ్డి, వెంకట రమణ, లింగం గౌడ్, సత్తయ్య, ఐలయ్య, కొమ్మురయ్య, లింగం, బాలు గణేశ్ పాల్గొన్నారు.

కేసీఆర్ ప్రభుత్వం విఫలం

- పేపర్ లీకులు, కోర్టు తీర్పులతో యువతకు తీరని అన్యాయం
- నియోజకవర్గ అభివృద్ధే ప్రధాన లక్ష్యం
- ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి


వెంకటాపూర్‌లో మాట్లాడుతున్న నారాయణరెడ్డి

తలకొండపల్లి: యువతకు ఉద్యోగాలు కల్పించడంలో సీఎం కేసీఆర్ ప్రభుత్వం విఫలమైందని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి ఆరోపించారు. శనివారం మండలంలోని వెంకటాపూర్‌లో కాంగ్రెస్ అధిష్టానం ప్రకటించిన 6 గ్యారంటీ పథకాలపై ఎమ్మెల్సీ ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రమేష్‌యాదవ్ ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేపర్ లీకులు, కోర్టు తీర్పులతో పరీక్షలను ప్రభుత్వం రద్దు చేసి వాయిదా వేయడంతో యువతకు తీరని నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని ప్రకటించారు. యువతకు ఉద్యోగాలు, రైతులకు సాగు నీరు, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. హామీ అమలులో కేసీఆర్ విఫలమయ్యారని మండిపడ్డారు. అనేక రంగాల్లో రాష్ట్రం వెనుకబడిపోయిందని తెలిపారు. రూ.5 లక్షల కోట్లు రాష్ట్ర ప్రభుత్వం అప్పు చేసిందని వెల్లడించారు. కేసీఆర్ నియంత పాలనను కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యే అసమర్థత వలన కల్వకుర్తి నియోజకవర్గ అన్ని రంగాల్లో అభివృద్ధికి నోచుకోలేదన్నారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోయిన బాధితులకు ఎమ్మెల్యే డబ్బులు ఇప్పించలేకపోయారని ఆరోపించారు. గ్యారంటీ పథకాలను అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే అమలు చేస్తామన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కసిరెడ్డి ప్రజలను కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శ్రీనివాసురెడ్డి, సర్పంచ్ పయ్యావుల రమేష్ యాదవ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, జిల్లా ఉపాధ్యక్షుడు భగ్‌వాన్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి రవీందర్‌యాదవ్, సోషల్ మీడియా అసెంబ్లీ ఇంచార్జ్ అజీం, మండల ఎస్సీ సెల్ చైర్మన్ చెన్నకేశవులు, సర్పంచ్‌లు వెంకట్రాంరెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, శ్రీశైలం, రాజేందర్‌రెడ్డి, రేణురెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే ప్రజాపాలన

- కేసీఆర్ నియంత పాలనకు త్వరలో చరమగీతం
- ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద్‌రెడ్డి
- అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తా
- కసిరెడ్డి నారాయణరెడ్డి


మాట్లాడుతున్న వంశీచంద్‌రెడ్డి

మాడ్గుల: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఎస్‌కేవై ఫంక్షన్ హాల్‌లో శనివారం మండల పార్టీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వంశీచంద్‌రెడ్డి, కల్వకుర్తి కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకురాలు సోనియాగాంధీ తెలంగాణ ప్రజల ఆకాంక్షలను గుర్తించి.. ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చారని తెలిపారు. అయితే రాష్ట్రం ఏర్పడిన తర్వాత అధికారంలోకి వచ్చిన సీఎం కేసీఆర్ ప్రజల కోసం పనిచేయకుండా తన కుటుంబం కోసం పనిచేస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ నియంత పాలనకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని హామీ ఇచ్చారు. అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని, ప్రజలకు అందుబాటులో ఉంటానని నారాయణరెడ్డి పేర్కొన్నారు. సమావేశంలో ఎంపీపీ పద్మ, జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రాంరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ్మ, సర్పంచ్‌లు, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు

నేడు సద్దుల బతుకమ్మ

ఇబ్రహీంపట్నం: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబంగా నిలిచే బతుకమ్మ వేడుకల్లో చివరిరోజున నిర్వహించే సద్దుల బతుకమ్మ సంబురాలను ఇబ్రహీంపట్నంలో ఆదివారం జరుపుకోనున్నారు. మొదటి రోజు ఎంగిలిపూల బతుకమ్మతో ఈ వేడుకలు ప్రారంభమై.. తొమ్మిది రోజులపాటు కొనసాగాయి. ఇబ్రహీంపట్నంలోని భవాని నాగలింగేశ్వర, ఈశ్వరాంజనేయ, త్రిశక్తి, మహంకాళి, అయ్యప్ప ఆలయాల వద్ద, పట్టణంలోని ప్రధాన కూడళ్ల వద్ద, బస్తీల్లో సద్దుల బతుకమ్మ సంబురాలను మహిళలు సామూహికంగా జరుపుకోనున్నారు. అనంతరం బతుకమ్మలను నిమజ్జనం చేస్తారు.

హామీలతో మభ్యపెడుతున్న పార్టీలు

తుర్కయంజాల్: అసెంబ్లీ ఎన్నికల్లో అక్రమమార్గాల్లో గెలిచి అధికారంలోకి రావడానికి బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు పోటీ పడుతున్నాయని తెలంగాణ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి మాధవరెడ్డి విమర్శించారు. శనివారం తుర్కయంజాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ పార్టీలు అమలు కానీ హామీలను గుప్పిస్తు ప్రజలను మభ్యపెడుతున్నాయని ఆరోపించారు. మద్యం అమ్మకాలను విపరీతంగా పెంచి తాగుబోతుల రాష్ట్రంగా మారుస్తున్నాయని దుయ్యబట్టారు. ఉద్యోగాల భర్తీ లేకపోవడంతో నిరుద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, నిరుద్యోగుల ఆత్మహత్యలకు ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. నిత్యావసర సరకుల ధరలు పెరుగుతున్న పట్టించుకునే నాథుడే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో తెలంగాణ కమ్యూనిస్టు పార్టీని గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వెంకట్ రెడ్డి, సత్తమ్మ, సైదమ్మ, చంద్రకళ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా 'ఆమనగల్లు లయన్స్'

ఆమనగల్లు: ఆమనగల్లు లయన్స్ క్లబ్ నిరుపేదలకు అండగా నిలుస్తోందని లయన్స్ మాజీ అధ్యక్షుడు రమేశ్ అన్నారు. ఆమనగల్లు పట్టణంలో శనివారం డాక్టర్ జూలూరి పర్వతాలు వర్ధంతి సందర్భంగా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని రవీంద్రానందతో కలిసి రమేశ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆమనగల్లు లయన్స్‌క్లబ్ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలిచిందని అన్నారు. ఈ సందర్భంగా 450 మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు లయన్స్‌క్లబ్ కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి, పీఆర్ఓ పాషా, జిల్లా చైర్మన్ రమేశ్, కోశాధికారి వెంకటయ్య, సభ్యులు బాలకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులపై సర్కార్ కుట్ర

రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జంగారెడ్డి


రైతులతో మాట్లాడుతున్న జంగారెడ్డి తదితరులు

యాచారం: ఓంకారేశ్వరాలయ భూములను సర్కార్ కాజేయాలని చూస్తోందని, అందుకే కౌలు రైతులకు హక్కులు కల్పించకుండా కుట్ర చేస్తోందని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జంగారెడ్డి పేర్కొన్నారు. నందివనపర్తి గ్రామంలోని ఓంకారేశ్వరాలయ భూములను శనివారం సీపీఎం, రైతు సంఘం బృందం ప్రతినిధులు పరిశీలించారు. తాడిపర్తి, నస్దిక్‌సింగారం, కుర్మిద్ద గ్రామాల్లో ఉన్న ఆలయ భూములను వారు సందర్శించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా జంగారెడ్డి మాట్లాడుతూ వందేళ్లకు పైగా 400 కుటుంబాలకు చెందిన రైతులు ఓంకారేశ్వరాలయ భూములను సాగు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నారని తెలిపారు. కౌలు రక్షిత చట్టం ప్రకారం రైతులకు సర్టిఫికెట్లు ఉన్నాయని పేర్కొన్నారు. కౌలు రైతులకు అన్యాయం చేయాలని చూసినా, లాక్కోవాలని కుట్రలు చేసినా సీపీఎం, రైతు సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. సీఎం కేసీఆర్ సర్కార్ ఓంకారేశ్వరాలయ భూములను టీఎస్ఐఐసీ ద్వారా సేకరించి ఫార్మాసిటీకి ఇవ్వాలని చూస్తుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, సీపీఎం యాచారం మండల కార్యదర్శి నర్సింహ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అంజయ్య, నాయకులు మల్లేశ్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

అసమర్థ పాలనకు చరమగీతం


గ్యారంటీ స్కీంల గురించి ప్రజలకు వివరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కడ్తాల్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని ఆ పార్టీ జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్ తెలిపారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డికి మద్దతుగా శనివారం మండలంలోని పుల్లేరుబోడ్‌తండా, జమ్ములాబావితండాల్లో గడప గడపకూ కాంగ్రెస్ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీక్యానాయక్ మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ అసమర్థ పాలన చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. ఈ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రగతి కోసం, భవిత కోసం రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, సర్పంచ్ శంకర్, నాయకులు భాస్కర్‌రెడ్డి, హన్మానాయక్, కో ఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబ, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, పట్టణ అధ్యక్షుడు రాంచందర్‌నాయక్, మాజీ సర్పంచ్ వేణుగోపాల్, ఎస్సీ సెల్ అధ్యక్షులు అశోక్, ఇక్బాల్ ఉన్నారు.

'పట్నం' గడ్డపై గులాబీ జెండా ఎగురవేస్తాం


బీఆర్ఎస్ మేనిఫెస్టోను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: పట్నం గడ్డపై మరోమారు గులాబీ జెండా ఎగురవేస్తామని ఎంపీపీ కృపేష్ ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఇబ్రహీంపట్నం మండలంలోని నాగన్‌పల్లి, పోల్కంపల్లి గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ మేనిఫెస్టోతో పాటు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కృపేష్ మాట్లాడుతూ 15 ఏళ్లుగా మంచిరెడ్డి కిషన్‌రెడ్డి నాయకత్వంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అభివృద్ధిలో పరుగులు పెడుతుందన్నారు. ప్రత్యేక చొరవతో ప్రభుత్వం నుంచి కోట్లాది రూపాయలు నిధులు తీసుకొచ్చి మౌలిక సదుపాయలు కల్పించారని తెలిపారు. ఇప్పటికే మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన మంచిరెడ్డి.. ఈ సారి గెలిస్తే హ్యాట్రిక్ ఎమ్మెల్యే అవుతారన్నారు. ఆయనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు..ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు బుగ్గరాములు, ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, నాయకులు రవీందర్, దానయ్య, గిరి, కృష్ణ, బాలయ్య, చందు తదిరులు పాల్గొన్నారు.

పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివి


ఎస్ఐ హన్మంతరెడ్డి విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎస్ఐ తదితరులు

ఆమనగల్లు: పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివి ఎస్ఐ బాల్‌రాం అన్నారు. ఆమనగల్లు పోలీసు స్టేషన్ ఆవరణలో శనివారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్ ఆవరణలో ఉన్న ఎస్ఐ హన్మంతరెడ్డి విగ్రహానికి నివాళి అర్పించారు. అనంతరం పోలీసు అమరవీరుల ఆత్మశాంతి కోసం మౌనం పాటించారు. ఏఎస్ఐలు యాదయ్య, బాల్‌రెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.

మంచాలలో..

మంచాల: మంచాల పోలీస్ స్టేషన్‌లో విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ శనివారం సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అమరవీరుల చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో సీఐ కాశీ విశ్వనాథ్, ఎస్సైలు రవి నాయక్, సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

కనుల పండువగా శరన్నవరాత్రులు

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రధాన ఆలయాలతో పాటు దేవీ ఆలయాల్లో ఉత్సవాలు ఘనంగా జరుపుకుంటున్నారు. వేడుకల్లో భాగంగా ఏడవ రోజు శనివారం అన్నపూర్ణేశ్వరిదేవి, మహాలక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు అమ్మవారు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య కలశ పూజ, విశేష పూజలు, యజ్ఞం, చండీహోమం, అర్చనలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు.


ఇబ్రహీంపట్నం: దుర్గాదేవి అలంకరణలో అమ్మవారు


ఆమనగల్లు: అమ్మవారి పూజలో భక్తులు


కడ్తాల్: మహాలక్ష్మీదేవి అలంకరణలో అమ్మవారు